క్లుప్తంగా

అడిషనల్ కలెక్టర్ పూజలు



మహాలింగేశ్వర స్వామికి పూజలు చేస్తున్న అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పందిల్లలోని మహాలింగేశ్వరస్వామిని శనివారం అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. ఆలయంలో నిర్వహించిన శివపార్వతుల కల్యాణం తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రమేశ్, ప్రభాకర్‌రెడ్డి, గురువారెడ్డి, రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

నేత్రపర్వంగా మల్లికార్జున స్వామి కల్యాణం

మర్కూక్(గజ్వేల్): మండలంలోని నర్సన్నపేట గ్రామంలో శనివారం గ్రామ యాదవ సంఘం అధ్యక్షుడు నర్సింహులు ఆధ్వర్యంలో మల్లికార్జున స్వామి కల్యాణం అంగరంగవైభవంగా జరిగింది. ఏటా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మల్లన్న, గొల్ల కేతమ్మ కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామి వారి కల్యాణం తిలకిస్తారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ పాండుగౌడ్, జెడ్పీటీసీ మంగమ్మ రాంచంద్రం యాదవ్, ఎంపీపీ ఉపాధ్యక్షుడు బాల్‌రెడ్డి, మండల ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు కృష్ణ యాదవ్, ఎంపీటీసీ నరేందర్, మాజీ సర్పంచ్ మాదవి, మాజీ వార్డు సభ్యుడు కనకరాజు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దపట్నం.. అగ్నిగుండాలు

కొండపాక(గజ్వేల్): మండలంలోని మర్పడ్గలో విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో శివపార్వతుల కల్యాణాన్ని పురస్కరించుకొని శనివారం ఒగ్గు కళాకారులు నిర్వహించిన పెద్దపట్నం, అగ్ని గుండాలు కార్యక్రమం నేత్రపర్వంగా జరిగింది. శుక్రవారం అర్ధరాత్రి శ్రీశైలంలో జరిపినట్లు శివపార్వతుల కల్యాణం నిర్వహించారు.

పార్వతీ పరమేశ్వరుల కల్యాణం.. ఎడ్లబండ్ల ఊరేగింపు

జగదేవ్‌పూర్(గజ్వేల్): శివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని తిగుల్ గ్రామంలో పార్వతీ పరమేశ్వర ఆలయంలో శనివారం పార్వతీ పరమేశ్వరుల కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. అనంతరం ఆలయం ముందు అగ్ని గుండ ప్రవేశం, సాయంత్రం గ్రామంలో ఎడ్ల బండ్ల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు.

రంగనాయక సాగర్‌లోకి నీళ్లు వదలాలి

చిన్నకోడూరు(సిద్దిపేట): రంగనాయక సాగర్ రిజర్వాయర్‌లోకి ఒక టీఎంసీ నీటిని విడుదల చేయాలని ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన చిన్నకోడూరులో మాట్లాడుతూ పది రోజుల్లో నీటిని విడుదల చేయకుంటే రైతుల పక్షాన ఆందోళనలు చేపడతామన్నారు. మిడ్‌మానేరులో నీరు ఉన్నప్పటికీ అనంతగిరి రిజర్వాయర్‌లోకి ఎందుకు నీటిని విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. అనంతగిరి రిజర్వాయర్‌లోకి నీటిని విడుదల చేసి అక్కడి నుంచి రంగనాయక సాగర్‌లోకి ఒక టీఎంసీ నీటిని విడుదల చేయాలని, లేకుంటే మండలంలో పంటలు ఎండిపోయి రైతులకు నష్టం వాటిల్లే ప్రమాదముందన్నారు.

వాటర్ ప్లాంట్ ఏర్పాటు అభినందనీయం

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

వర్గల్(గజ్వేల్): స్వగ్రామం కోసం సొంత నిధులు వెచ్చించి మాజీ ఉపసర్పంచ్ జైపాల్ రెడ్డి ఉచిత వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం వర్గల్ మండలం మల్లారెడ్డిపల్లిలో ఏర్పాటుచేసిన వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు సేవానిరతి కలిగి ఉండాలన్నారు. వాటర్ ప్లాంట్ ఏర్పాటుచేసిన జైపాల్‌రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం గ్రామంలోని మల్లికార్జునస్వామి, కొండపోచమ్మ ఆలయాలు సందర్శించి పూజలు చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, జిల్లా యూత్ అధ్యక్షుడు నాగరాజు, పీఏసీఎస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు తుమ్మ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగించుకోండి

వర్గల్(గజ్వేల్): ప్రశాంత వాతావరణంలో ప్రజలు తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని తొగుట సీఐ లతీఫ్ అన్నారు. రాబోవు పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా శనివారం బేగంపేట ఎస్‌ఐ రవికాంత్‌తో కలిసి మండలంలోని నెంటూరు గ్రామాన్ని సందర్శించారు. వివిధ అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. మద్యం, డబ్బు తదితర ప్రలోభాలకు ఓటర్లు లొంగొద్దని, నచ్చిన అభ్యర్థికి నిర్భయంగా ఓటేసి ఓటింగ్ శాతం పెంచాలన్నారు.

నిర్లక్ష్యంగా నిర్మాణం

- ప్రయాణికులకు అనువుగాలేని బస్టాండ్
- బస్టాండ్‌లోకి రాని బస్సులు
- శిథిలావస్థలో మరుగుదొడ్లు, మూత్రశాలలు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు



రోడ్డు మీదే ప్రయాణికులను ఎక్కించుకెళ్తున్న దృశ్యం

ఇక్కడ పేరుకే బస్టాండ్. దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికుల కనీస అవసరాలు తీర్చడానికి కూడా అనువుగా లేక శిథిలావస్థకు చేరుకుంది. బస్సులు కూడా బస్టాండ్‌లోకి వెళ్లలేనివిధంగా ఉంది. నిత్యం ప్రయాణికులు ఈ బస్టాండ్‌లో నానా అవస్థలు పడాల్సివస్తోంది. మిరుదొడ్డి మండల కేంద్రంలో పాలక వర్గాలు, అధికారులు అనాలోచితంగా నిర్మించిన బస్టాండ్ నిరుపయోగంగా మారింది.

మిరుదొడ్డి(దుబ్బాక): రూ.లక్షల వ్యయంతో నిర్మించిన మిరుదొడ్డి ఆర్టీసీ బస్టాండ్‌లో కనీస మౌలిక వసతులు లేక ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. బస్సులు ప్రాంగణంలోకి వచ్చిన దాఖలాలు ఉండవు. దీంతో ప్రయాణికులు రోడ్డుపైనే బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. మిరుదొడ్డి, అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు వివిధ పనులపై మిరుదొడ్డి వస్తారు. వారి అవసరం కోసం ఉమ్మడి రాష్ట్ర పాలనలో బస్టాండ్‌ను నిర్మించారు. ప్రజావసరాలను విస్మరిస్తూ నిర్లక్ష్యంగా బస్టాండ్ నిర్మాణాన్ని చేపట్టడంతో ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. నిత్యం సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, సికింద్రాబాద్, హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులు, విద్యార్థులు రోడ్డుపైనే ఎక్కించుకోవడం నిత్యకృత్యమైంది.

అపరిశుభ్రతకు నిలయం

బస్టాండ్ అపరిశుభ్రతకు నిలయంగా మారింది. పందులు, కుక్కలు సంచరిస్తున్నాయి. చెత్తా చెదారం పేరుకు పోవడంతో దుర్వాస వెదజల్లుతోందని ప్రయణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్‌లోకి బస్సులు రాకపోవడంతో ప్రైవేట్ వాహనాలకు అడ్డాగా మారింది. అంతేకాకుండా రాత్రివేళలో మందుబాబులు విడిది చేస్తున్నారు. ఎవరూ పట్టించుకోకపోడంతో వారి ఆగడాలు ఎక్కువయ్యాయి.

వినియోగంలోలేని మూత్రశాలలు

బస్టాండ్‌లో నిర్మించిన మూత్రశాలలు, మరుగుదొడ్లు వినియోగంలోలేవు. అధికారుల పర్యవేక్షణలేక మరుగుదొడ్ల తలుపులు, వాటర్ ట్యాంకులు, పైపులను దొంగలు ఎత్తుకెళ్లారు. దీంతో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రయాణికులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఇబ్బందిపడుతున్నారు. మహిళా ప్రయాణికులు పడే ఇబ్బందులు వర్ణనాతీతం.



తలుపులులేని మూత్రశాలలు, మరుగుదొడ్లు

పట్టించుకునే వారు లేరు



పట్టించుకునే అధికారులు లేక ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. బస్సులు బస్టాండ్‌లోకి రావడానికి కూడా అనుకూలంగా లేదు. బస్టాండ్‌లో అపరిశుభ్రత తాండవిస్తోంది. కుక్కలు, పందులు సంచరిస్తున్నాయి. రాత్రివేళ మందు బాబులకు అడ్డాగా మారింది. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– మద్దెల రాజేష్, మిరుదొడ్డి

వినియోగంలోకి తీసుకురావాలి



ప్రయాణికులకు అనువుగా బస్టాండ్‌ను నిర్మించలేదు. సౌకర్యాలు లేవు. నిరుపయోగంగా మారిన బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురావాలి. మరుగుదొడ్లు, మూత్రశాలలతో పాటు బస్టాండ్‌లో మరమ్మతులు చేట్టాలి. దూరప్రాంత ప్రయాణికులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఇబ్బందిపడుతున్నారు.

– ముత్యాల భూపాల్, కాసులాబాద్



చిన్నకోడూరులోని రైతుబజార్

చిన్నకోడూరులో రైతుబేజార్

రోడ్డు పక్కనే విక్రయాలు

చిన్నకోడూరు(సిద్దిపేట): దళారుల ప్రమేయం లేకుండా రైతులు నేరుగా కూరగాయలు అమ్ముకునే విధంగా రూ.లక్షలు వెచ్చించి రైతుబజార్ నిర్మించారు. అధికారుల నిర్లక్ష్యంతో అది నిరుపయోగంగా మారింది. దీంతో రోడ్డకు ఇరువైపులా కూరగాయలు, మాంసం విక్రయాలు జరుపుతున్నారు. చిన్నకోడూరు మండల కేంద్రంలో 2018లో రూ.30 లక్షలు వెచ్చించి రైతుబజార్ నిర్మించారు. 18 దుకాణాల్లో ఏడాది పాటు విక్రయాలు కొనసాగాయి. మార్కెట్‌లో మురుగు కాలువ నిర్మించకపోవడంతో విక్రయదారులకు సమస్యగా మారింది. ఫలితంగా రోడ్లకు ఇరువైపులా కూరగాయలు విక్రయిస్తున్నారు. వినియోగంలో లేకపోవడంతో రైతుబజారులో పిచ్చి మొక్కలు పెరిగి, చెత్త చెదారంతో నిండిపోయింది. అంతేకాకుండా మందుబాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. రోడ్డు పక్కనే కూరగాయల విక్రయాలు జరుగుతుండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. అధికారులు స్పందించి రైతుబజార్‌ను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

జనగామ డీసీసీ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి



సీసీ రోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న జనగామ డీసీసీ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని సలాఖపూర్ గ్రామాల్లో సీసీ రోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఒరిగింది ఏమీ లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు నెలల వ్యవధిలోనే నాలుగు గ్యారంటీలను అమలు చేసిందన్నారు. ప్రభుత్వం నుంచి మరిన్ని నిధులు తెచ్చి అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మిస్తామని తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాజేశ్వర్‌రెడ్డి, మాజీ పీఏసీఎస్ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఊట్ల శ్రీధర్‌రెడ్డి, మహేందర్, మనోహర్, పర్శరాములు, కరుణాకర్, రాజు, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గట్టు మల్లన్న ఆలయంలో పూజలు



ఆలయ నిర్మాణ దాతలను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని కొండాపూర్ గట్టు మల్లన్నను శనివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు రాజమౌళి, మహేష్ స్వామివారికి అభిషేకాలు, హోమలు నిర్వహించారు. రాజరాజేశ్వరీ అమ్మవారికి మహిళలు కుంకుమార్చన చేశారు. ఒగ్గు పూజారులు పట్నాలు వేశారు. అక్కన్నపేట మండలంలోని రామవరం గ్రామానికి చెందిన ఎడబోయిన శోభ, జైపాల్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పోచమ్మ, ఎల్లమ్మ ఆలయ నిర్మాణాలకు సహకరించిన జైపాల్‌రెడ్డి దంపతులను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి అశోక్, మాజీ సర్పంచ్‌లు జాటోత్ రేణుక, ప్రభాకర్‌గౌడ్, నరేష్, శ్రీధర్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యుడు అల్లం రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.


మహా పూర్ణాహుతితో ముగిసిన వేడుకలు



నాచగిరిలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

వర్గల్(గజ్వేల్): నాచగిరి శివాలయంలో నాలుగు రోజులపాటు కొనసాగిన మహాశివరాత్రి వేడుకలు శనివారం ముగిశాయి. ఉదయం అర్చకులు హోమం నిర్వహించారు. 11.30 గంటలకు మహా పూర్ణాహుతి, అవబృద స్నానంతో ఉత్సవ వేడుకలు ముగిశాయి. వేడుకల్లో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



మంగళసూత్రం చూపుతున్న శ్రీరామ్ చరణ్ శర్మగూరుజీ

దౌల్తాబాద్(దుబ్బాక): మండలంలో మహా శివరాత్రి సందర్భంగా శివపార్వతుల కల్యాణం నేత్రపర్వంగా జరుగుతుంది. ఏటా శ్రీరామ్ చరణ్ శర్మ గూరుజీ శివపార్వతుల కల్యాణం, మహాదేవుడికి అభిషేకం, అంగరంగా వైభవంగా నిర్వహిస్తారు. శుక్రవారం అర్ధరాత్రి దొమ్మాట, గాజులపల్లిలో నిర్వహించిన శివపార్వతుల కల్యాణం తిలకించడానికి మండలం, జిల్లా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. శివరాత్రి సందర్భంగా లక్ష పుష్పార్చన, లింగోద్భవ కాలంలో మహాదేవుడికి అభిషేకం, సప్తహారతి నిర్వహించారు.

ముగిసిన శంభుని గుట్ట జాతర



దౌల్తాబాద్‌లో శంభులింగేశ్వర ఆలయం చుట్టూ ఎడ్ల బండ్లతో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

దౌల్తాబాద్(దుబ్బాక): మహాశివరాత్రిని పురస్కరించుకొని దౌల్తాబాద్‌లోనిగుట్టపై ఉన్న శంభులింగేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామున అగ్ని గుండాలు తొక్కడం, పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, ఎడ్ల బండ్ల ప్రదక్షిణ తదితర కార్యక్రమాలు జరిగాయి. దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి శ్రీనివాస్ రెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఆది వేణుగోపాల్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆటలతో ఆరోగ్యం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత

మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత



పోటీలో తలపడుతున్న వెంకటపూర్, పోతారం(ఎస్) క్రీడాకారులు

హుస్నాబాద్‌రూరల్: ఆటలతో ఆరోగ్యం కలుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత అన్నారు. శనివారం పోతారం(ఎస్) కృష్ణ కబడ్డీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామీణ క్రీడ కబడ్డీ అంతరిస్తున్న తరుణంలో హోంగార్డు కృష్ణ పోతారం(ఎస్) యువతకు కబడ్డీలో శిక్షణ ఇచ్చి వారిని రాష్ట్ర క్రీడాకారులుగా తయారు చేయడం అభినందనీయమన్నారు. వీరు పోలీసు ఉద్యోగాలు సాధించడం విశేషం. ఈ పోటీలు రెండు రోజులు జరగనున్నాయి. మొత్తం 50 జట్లు పాల్గొన్నాయి. కాగా శనివారం జరిగిన మ్యాచ్‌లో వెంకటాపూర్, పోతారం జట్లు తలపడ్డాయి. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, ఎంపీటీసీ శ్రీనివాస్, ఎస్‌ఐ మహేశ్, మాజీ సర్పంచ్‌లు కూడం లింగమూర్తి, బత్తిని సాయిలు, లావుడ్య వీరన్న నాయక్, చొల్లేటి శంకరయ్య, హరిబాబు, బంక చందు, వెన్న రాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకే ప్రాధాన్యత : ఏసీపీ



పోలీసులు, కేంద్ర బలగాల కవాతు

గజ్వేల్‌రూరల్: శాంతి భద్రతల పరిరక్షణకే ప్రాధాన్యత ఇస్తామని, త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో కొనసాగేలా చర్యలు తీసుకుంటామని గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రధాన వీధుల్లో శనివారం గజ్వేల్ సీఐ సైదా, అదనపు సీఐ ముత్యంరాజు, తొగుట సీఐ లతీఫ్, గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది, కేంద్ర బలగాలు, సీఐఎస్‌ఎఫ్‌తో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పట్టణంలోని ముట్రాజీపల్లిరోడ్డు, సంగాపూర్ రోడ్డు, ఇందిరా పార్కు చౌరస్తా, కోటమైసమ్మ మీదుగా పిడిచెడ్ రోడ్, కోర్టు చౌరస్తా నుంచి తిరిగి అంబేద్కర్ చౌరస్తా మీదుగా ప్రధానదారిలో కవాతు కొనసాగంది.

బీఆర్ఎస్ అనాలోచిత నిర్ణయాలతో అన్యాయం

నియోజకవర్గ నిరుద్యోగులు



నోటిఫికేషన్ పత్రాలను చూపుతున్న నిరుద్యోగులు

హుస్నాబాద్: నాటి బీఆర్ఎస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో హుస్నాబాద్ నియోజకవర్గంలోని నాలుగు మండలాల నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందని నియోజకవర్గ నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జిల్లాల పునర్విభజనతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని నాలుగు మండలాలు హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి మండలాలను సిద్దిపేట జిల్లాలో విలీనం చేయడంతో ఈ ప్రాంత నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలు కోల్పోయే ప్రమాదముందన్నారు. ఇటీవల సింగరేణి ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేశారని, ఈ పోస్టులకు 95 శాతం లోకల్ జిల్లాలుగా గుర్తించబడి, మిగితా 5 శాతం పోస్టుల్లో సిద్దిపేట జిల్లాతో పాటుగా మిగతా జిల్లాలు, ఇతర రాష్ట్రాల వారికి అవకాశం కల్పించారన్నారు. సిద్దిపేట జిల్లాను నాన్ లోకల్ జిల్లాగా ప్రకటించడంతో ఈ నాలుగు మండలాల నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగి ఉద్యోగ అర్హత కోల్పోతున్నారని తెలిపారు. ఈ నాలుగు మండలాలను వెంటనే సింగరేణితో పాటు అన్ని ప్రభుత్వ రంగాల్లో ఉద్యోగ అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో నియోజకవర్గ నిరుద్యోగులు నరేష్, తిరుపతి, రమేష్, లక్పతి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



కుండల్లో నీటిని తెస్తున్న గ్రామస్తులు

కొండపాక(గజ్వేల్): కొండపాకలోని రుద్రేశ్వర ఆలయంలో ఈనెల 7వ తేదీన ప్రారంభమైన మహా శివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. భక్తులు మట్టి కుండల్లో నీటిని తెచ్చి రుద్రేశ్వరుడికి సహస్ర ఘటాభిషేకం నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. పూర్ణాహుతితో బ్రహ్మోత్సవాల క్రతువును ముగించారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ అనంతుల శ్యాంమోహన్, కోశాధికారి రేణికింది బాలయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా స్వరూప



హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణానికి చెందిన తోట స్వరూప బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైనట్లు రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి శనివారం తెలిపారు. కాగా స్వరూప బీజేపీ మహిళా మోర్చా హుస్నాబాద్ పట్టణ అధ్యక్షురాలిగా, జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. మోదీ నాయకత్వాన్ని బలపరిచే విధంగా, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి బండి సంజయ్ గెలుపు కోసం కృషి చేస్తానన్నారు.

◆ బస్సు నడపాలి

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని మాచాపూర్ గ్రామం విద్యార్థులు సిద్దిపేట, చిన్నకోడూరులో విద్యనభ్యస్తున్నారని, బస్సు సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందిపడుతున్నారని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సంజీవ్ కుమార్ శనివారం తెలిపారు. నిత్యం తరగతులకు సకాలంలో హాజరుకాలేకపోతున్నారని పేర్కొన్నారు.

◆ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

బెజ్జంకి(సిద్దిపేట): పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి అధ్యక్షతన శనివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశంలో మాట్లాడారు. గెలుపు ఓటములు సహజమని కార్యకర్తలు అధైర్య పడొద్దన్నారు. నిధులు తేలేని ఎంపీ సంజయ్, మోసపూరిత మాటలతో వస్తున్న కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మరన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ ఎంపీగా బీఆర్ఎస్ అభ్యర్థి విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

◆ పీఆర్సీ ప్రకటనపై హర్షం

హుస్నాబాద్: తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులకు 21 శాతం పీఆర్సీ ఇస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించడంపై హుస్నాబాద్ డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు శనివారం హర్షం వ్యక్తం చేశారు. ఆర్టీసీ ఉద్యోగులకు 2017కు పీఆర్సీ 21 శాతం, 2013కు సంబంధించిన 50 శాతం ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలపడం మంచి పరిణామమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు డిపో కార్మికుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.

◆ నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

హుస్నాబాద్ రూరల్: హుస్నాబాద్ డివిజన్‌లో పంటలకు సాగునీరు అందక ఎండిపోతున్నాయని, నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బీఆర్ఎస్ నాయకుడు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కూచనపెల్లి రైతులతో కలిసి ఎండిన పంటలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గౌరవెల్లి ప్రాజెక్టుకు గోదావరి జలాలు వస్తాయని ఆశతో రైతులు పంటలు సాగు చేశారన్నారు. ప్రాజెక్టు పనులను పూర్తి చేసి సాగునీరు అందించాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. పంట నష్టంపై ప్రభుత్వం సర్వే చేసి నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రైతులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

◆ మోతెలో జాతర

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని మోతె శివారులోని స్వయం భూలింగేశ్వర స్వామి జాతర శనివారం జరిగింది. భక్తులు భారీగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి పల్లకీ సేవ, కల్యాణం నిర్వహించారు.

◆ వైభవంగా శ్రీనివాసుడి కల్యాణం

దుబ్బాకటౌన్: తెలంగాణ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన దుబ్బాకలోని బాలాజీ ఆలయంలో శనివారం పద్మావతి, శ్రీనివాసుడి కల్యాణం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారి కల్యాణం తిలకించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.